## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి నాగార్జున ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి కాలనీ, ఉమాశంకర్‌నగర్, చలసాని నగర్ బందరు రోడ్డు, కామయ్యతోపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

### తేమ శాతం తగ్గించండి



పెనమలూరు: రైతులు ధాన్యంలో తేమ శాతం తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయధికారి కనకమేడల శైలజ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె తాడిగడప గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏఓ శైలజ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో తేమ శాతం 17 వరకు ఉండే విధంగా చూడాలన్నారు. గోనె సంచులు, రవాణాలకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

### నేత్రదానం



లక్ష్మీసరోజ(ఫైల్)

పెనమలూరు: పెనమలూరులో మహిళ తన మరణానంతరం నేత్రదానం చేసింది. గ్రామానికి చెందిన బెజవాడ లక్ష్మీసరోజ(58) గుండెపోటుతో మంగళవారం మృతిచెందింది. ఆమె చివరి కోరిక మేరకు భర్త బెజవాడ నాగేశ్వరరావు భార్య లక్ష్మీసరోజ కంటి కార్నియా దానం చేశారు. తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి కార్నియా సేకరించారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని మృతురాలి కుటుంబ సభ్యులు ఫణీంద్రగుప్తా, హరేంద్రగుప్తా కోరారు.

ఉంగుటూరు: మండలంలోని ఎలుకపాడుకి చెందిన అజ్మీర వెంకటేశ్వరరావు, గోపిల కుమార్తె త్రివేణి(18) నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య కళాశాలకు దానం చేశారు. త్రివేణి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందడం పాఠకులకు తెలిసిందే. సామాజిక స్ఫూర్తితో ఆలోచించిన తల్లిదండ్రులు ఆమె కళ్లను దానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

### భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం కార్తికమాసం బహుళ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. తొలుత ఉపాలయంలోని శ్రీఆంజనేయస్వామికి 25వేల తమలపాకులతో విశేష అర్చనలు జరిపారు. అనంతరం ఆలయ అర్చకుడు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. 108 మంది భక్తులు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పలువురు గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

### శ్రీరామలింగేశ్వరస్వామికి బిల్వార్చన



పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారికి బిల్వాలతో ప్రత్యేకంగా అలంకరించి బిల్వార్చన పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఈఓ ఎన్.భవాని, భక్తులు పాల్గొన్నారు.

### కారు డ్రైవర్‌పై కేసు నమోదు

పెనమలూరు: కారు యజమానురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన డ్రైవర్‌పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. కానూరు స్వర్ణ రెసిడెన్సికి చెందిన మంజుల వద్ద కారు డ్రైవర్‌గా కె.చంద్రశేఖర్ అనే వ్యక్తి గత సెప్టెంబర్ నెలలో పనిలో చేరాడు. అయితే అతను నిర్లక్ష్యంగా వ్యవహరించడం, దురుసుగా ప్రవర్తించసాగాడు. దీంతో ఈ నెల 13వ తేదీన అతడిని పనిలో నుంచి తొలగించింది. దీంతో అతను కారు యజమానురాలికి అసభ్యకరమైన వీడియోలు, మెసేజ్‌లు పెట్టి బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

# మద్దతు ధరకు దళారుల దెబ్బ

- యంత్రాలతో వరి కోతలు కోస్తున్న రైతులు
- తేమ శాతం పేరుతో తక్కువ ధరకు కొంటున్న దళారులు
- రూ.400 నష్టపోతున్న అన్నదాతలు



తాడిగడపలో ఆరుబయట ఆరబెడుతున్న ధాన్యం

పెనమలూరు: సార్వా వరి ధాన్యం దిగుబడులు సిద్ధంగా ఉన్నా పంట కొనడానికి మిల్లర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనిని ఆసరాగా చేసుకుని దళారులు రంగంలోకి దిగి మద్దతు ధర ఇవ్వకుండా రైతుల వద్ద ధాన్యం తక్కువ ధరకు కొంటున్నారు. పెనమలూరు మండల పరిధిలో సార్వాలో దాదాపు ఐదున్నర వేల ఎకరాల్లో వరి సాగు జరిగింది. వరి దిగుబడి 15 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతు సేవా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని ప్రకటన చేశారు. తీరా వరి కోతలు మొదలయ్యాక పరిస్థితులు తారుమారయ్యాయి. రైతులు వరి కోత యంత్రాలతో కోతలు కోస్తున్నారు. పంటను ఆరబెట్టి అమ్మకానికి ఏర్పాట్లు చేయగా మిల్లర్లు ముందుకు రావడం లేదు. కనీసం చాలినన్ని గోనె సంచులు ఇవ్వడం లేదు. ధాన్యం మిల్లులకు తరలించడానికి రవాణాకు లారీలు కూడా ఏర్పాటు చేయడం లేదు. మండల పరిధిలో ఐదున్నర వేల ఎకరాల్లో కేవలం 700 ఎకరాల్లోనే ఇప్పటివరకు వరి కోతలు కోయగా ప్రాథమిక దశలోనే రైతులు నానా ఇబ్బందులు పడసాగారు. పూర్తిగా వరి కోతలు కోసి పంట దిగుబడి ఒకేసారి వస్తే పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.



రవాణా లేక నిలిచిపోయిన ధాన్యం బస్తాలు

#### తెర పైకి దళారులు

వరి కోతలు మొదలు కాగానే దళారులు తెరపైకి వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి నేరుగా మిల్లులకు పంపేవారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ము జమ చేసేవారు. అయితే కూటమి పాలనలో రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం చూపడంతో దళారులు తెరపైకి వచ్చారు.

#### గిట్టుబాటు ధర ఏది..?

యంత్రాలతో వరి కోతలు కోయడం వల్ల తేమ శాతం అధికంగా ఉందని దళారులు బస్తా వరి రూ.1,300 నుంచి రూ.1,400కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీ బస్తా రూ.1,725, ఏ గ్రేడ్ రూ.1,740 ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. తేమ శాతం ఎక్కువగా ఉంటే క్వింటాకు కేజీ ధాన్యం తగ్గించాల్సి ఉంది. దళారులు ఈ నిబంధనలు ఏవీ పట్టించుకోరు కాబట్టి రైతులు బస్తా ధాన్యానికి రూ.400 నష్టపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


## ఆడపిల్లలకు రక్షణ కల్పించాలి



పోరంకిలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, మహిళలు

పెనమలూరు: రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని, అత్యాచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల సీఐటీయూ, మహిళల ఆధ్వర్యాన పోరంకిలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ నేడు కూటమి పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయన్నారు. రాష్ట్రంలో పరిస్థితుల కారణంగా ఆడపిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న కాలంలో పవన్ కల్యాణ్ రాష్ట్రంలో ఆడపిల్లలు తప్పిపోతున్నారని ఆరోపణలు చేసి నేడు మౌనంగా ఉంటున్నాడని విమర్శించారు. పవన్‌కల్యాణ్ మాటల్లో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. విశాఖపట్నంలో లా విద్యార్థినిపై నలుగురు విద్యార్థులు అత్యంత దారుణంగా అత్యాచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు వై.సరళ, రత్నకర్ణ, కంచర్ల పద్మ, విజయ, జోజిమేరీ, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కోటి దీపోత్సవం



గన్నవరం శివాలయంలో కార్తిక దీపాలు

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణదేవి సహిత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కోటి దీపోత్సవం నిర్వహించారు. తొలుత కార్తిక ఏకాదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో కార్తికమాస ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం సహస్ర దీపోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో పరమేశ్వరునికి, సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, లంక బేబి సరోజిని, తవ్వా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణకు ఆయుర్వేద యాప్



గూడవల్లి ఆయుర్వేద హాస్పిటల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు

రామవరప్పాడు: ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రోత్సాహంతో రూపొందించిన ఆయుర్వేద యాప్ ఎంతో దోహద పడుతుందని వైద్యురాలు రాగలత అన్నారు. విజయవాడరూరల్ మండలం గూడవల్లిలోని ఆయుష్మాన్ ఆయుర్వేద హాస్పిటల్‌లో మంగళవారం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్' యాప్‌ను ప్రారంభించారు. రాగలత మాట్లాడుతూ ఈ యాప్ ప్రతి వ్యక్తి శరీర ధర్మస్వభావాన్ని గుర్తించి ఆ వివరాల ఆధారంగా ఆరోగ్య స్థితిగతులను, జీవనశైలి విధానాన్ని పొందుపరుస్తుందన్నారు. ఆయా వ్యక్తులకు అనుగుణంగా ఆరోగ్య సూచనలు, ఆహార నియమాలు, అనుకూల మార్గదర్శకాలను అందించడం ఈ యాప్ ముఖ్య లక్ష్యమన్నారు. అనంతరం ఈ యాప్ ఆయుర్వేదం ద్వారా వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ సాధనంలా ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నెల రోజులపాటు దేశవ్యాప్తంగా ప్రతి ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రి, డిస్పెన్సరీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాప్‌పై అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వైద్యులు పి. మల్లికార్జునరావు, వాహిణి, సౌజన్య, లలిత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## రైతు గోడు పట్టించుకునే నాథుడేడీ?

- కోలవెన్ను ఆర్‌ఎస్‌కే వద్ద రైతుల నిరసన
- నాలుగు రోజులుగా ధాన్యం రోడ్ల మీదే ఉందంటూ ఆందోళన



కోలవెన్ను రైతుసేవా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కంకిపాడు: "నాలుగు రోజులుగా కోత కోసి, సంచులకెత్తిన ధాన్యం రోడ్ల మీదే ఉంది. ఒక్కరూ పట్టించుకోవడం లేదు. అదేమంటే తేమ శాతం ఎక్కువగా ఉందని సాకు చెబుతున్నారు. వాతావరణం బాగుంటే ఆందోళన చెందే వాళ్లం కాదు" అంటూ రైతులు కోలవెన్ను రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని రైతాంగం పంట కోతకు రావడంతో యంత్రాలతో కోత కోయించి గ్రామంలోని మండపాల సెంటరు, పీఏసీఎస్, పలు వెంచర్లలోని ఖాళీ ప్రదేశాలకు తరలించారు. సుమారుగా 50 లారీల ధాన్యం గ్రామంలోని వివిధ ప్రదేశాల్లో బస్తాలు, రాసులపై ఉంది. నాలుగు రోజులుగా రైతులు, కౌలురైతులు స్థానికంగా ఉన్న మిల్లులు, రైతు సేవా కేంద్రం చుట్టూ ధాన్యం విక్రయాల కోసం తిరుగుతున్నారు. అయినా ఏ ఒక్కరూ స్పందించకపోవడంతో రైతుసేవా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మిల్లర్ల నుంచి గోనె సంచులు రావడం లేదని, రవాణా కోసం వాహనాలు కూడా పంపడం లేదంటూ మండిపడ్డారు. ఓ మిల్లుకు తరలించిన ధాన్యం ఐదు రోజులుగా దిగుమతి కాకుండా ఉందని వాపోయారు. వాతావరణ పరిస్థితులు చూసి భయాందోళనలు చెందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని స్పష్టంచేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, వ్యవసాయశాఖల సిబ్బంది రైతులతో సంప్రదింపులు జరిపారు.

#### సంచులు ఇవ్వడం లేదు



నేను 27 ఎకరాలు కౌలు చేస్తున్నా. 14 ఎకరాల పంట కోత కోసి ఉంచాను. ఏడెకరాలు కాటా వేయించారు. ఇంకా ఏడెకరాలు సంచుల్లోకి ఎత్తాలి. సంచుల కోసం తిరుగుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పుడు వస్తాయో కూడా చెప్పడం లేదు. మిల్లుల నుంచి వాహనాలు పంపడం లేదు. వాతావరణం బాగోలేదు. మా పరిస్థితి అధ్వానంగా తయారైంది.

– మసిముక్కు సుబ్బారావు, కౌలురైతు, కోలవెన్ను

#### 1262 రకం కొనాలి



జగన్నాథపురం శివారులో నాకు మూడెకరాల పొలం ఉంది. 1262 విత్తనం సాగు చేశాను. గతేడాది ఈ రకానికి మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది కూడా అదే విత్తనం వేశాను. ఇప్పుడేమో 1262 తీసుకోమని చెబుతున్నారు. ముందే ఈ విత్తనం వద్దు అని చెప్తే సాగు చేయకుండా ఉండేవాళ్లం. ప్రభుత్వం స్పందించి 1262 రకం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలి.

– కె.శ్యాంప్రసాద్, రైతు, కోలవెన్ను

## ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



కానూరులో దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థినులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ కన్వీనర్ చక్రవర్తి

పెనమలూరు: కానూరులో రాజ్యాంగ ఆమోద దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవభక్తుని చక్రవర్తి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కారణంగానే ప్రతి ఒక్క పౌరుడు హక్కులు వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. నేటి యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, మాజీ టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, నేతలు అన్వర్, శ్రీహరి, రాజు, బాబు పాల్గొన్నారు. అలాగే కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరవ కోటేశ్వరరావు ప్రతి ఒక్కరు తమ హక్కులు కాపాడుకోవాలని సూచించారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, న్యాయవాది జీవీ రామకృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకిపాడు: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలను అన్ని కార్యాలయాలు, గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ వి.భావనారాయణ, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఉస్మాన్, ఏఎస్‌ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ పి.అనూష, పరిపాలనాధికారి ఎస్.బసవయ్య, ఈఓఆర్డీ కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు. గొల్లగూడెం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మదర్‌థెరిస్సా సేవా సంస్థ ప్రతినిధి తాడితోటి నరసింహారావు, గాడ్‌హెల్ప్ సొసైటీ ప్రతినిధి రాజు, మాలమహానాడు అధికార ప్రతినిధి చిట్టిబాబు, స్థానికులు పాల్గొన్నారు.



గన్నవరంలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ, రాజేంద్రప్రసాద్ చిత్రపటాల వద్ద నివాళులు

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ, మాజీ రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఎంపీడీఓ టి. స్వర్ణలత, పలువురు ఎంపీటీసీ సభ్యులు నివాళులర్పించారు. ఎంఈఓ–2 కమల, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, అధికార పక్షం, ప్రతిపక్ష పాత్రలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. పాఠశాల హెచ్‌ఎం వజ్రాల భూపాల్ రెడ్డి, సూరపనేని రవిప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఉయ్యూరులో నిర్వహించారు. ఏపీడీఈఈఏ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యాన గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి సీఐ రామారావు నివాళులర్పించారు. డీవైఈఓ పద్మారాణి, ఏపీడీఈఈఏ అధ్యక్షుడు పినమాల నాగకుమార్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జీవీ రమణ, లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, అధ్యక్షుడు నేరెళ్ల తేజ, సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్, సేవాసంస్థ చైర్మన్ కొలసాని రవికుమార్, గ్రంథాలయాధికారి రమణి పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేషగిరిరావు, సూపరింటెండెంట్ కొలుసు శివశంకర్, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పించారు.



కంకిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ పి.అనూష

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మన రాజ్యాంగం ఎంతో బలమైనదని చెప్పారు. ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.కృపానందం అధ్యక్షతన డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పాఠకులు నివాళులర్పించారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్, సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమాల్లో బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.



పురుషోత్తపట్నం లైబ్రరీలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠకులు

## ఓటరు నమోదుపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు

గన్నవరం: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ఓటర్ నమోదు సహాయ అధికారి, తహసీల్దారు కె. వెంకటశివయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఓటరు నమోదుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు పూర్తికానున్న ప్రతిఒక్కరూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025లో భాగంగా బీఎల్వోల ద్వారా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలుత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎలక్షన్ డీటీ ఎన్‌జీకే కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ ఏ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## 'హైందవ శంఖారావం' సభను విజయవంతం చేయండి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హిందూ దేవాలయాలు, సనాతన ధర్మ పరిరక్షణకై విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో 2025 జనవరి 5వ తేదీన విజయవాడలో తలపెట్టిన 'హైందవ శంఖారావం' బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) భౌద్ధిక్ విభాగ్ ప్రముఖ్ గణేష్ పిలుపునిచ్చారు. స్థానిక విజయవాడరోడ్డులోని శుభకృష్ణ ఎన్‌క్లేవ్‌లో హైందవ శంఖారావం సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ గన్నవరం ఖండ కార్యవాహ ఎదురువాడ శ్రీనివాసరావు, విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి జిల్లా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు పాల్గొన్నారు.

## అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని పూజలు చేశారు. దాత కాకాని సత్యవాణి సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం



కుట్టుమిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో 'నారీశక్తి' నినాదంతో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను మంగళవారం ప్రారంభించారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని మహిళా మండలి భవనంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ పిల్లా అనిత ప్రారంభించారు. తొలివిడతలో 50 మంది మహిళలకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు లంక రమేష్ తెలిపారు. ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లంక సురేంద్రమోహన బెనర్జీ, గ్రామ ప్రముఖులు కోడెబోయిన బాబి, రాయి గోపాలకృష్ణ, మండాది రవీంద్ర, సేవా సమితి సభ్యులు పీఎల్ మూర్తి, పుసుకొల్లు తేజ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కార్తిక వన సమారాధన



గన్నవరం: స్థానిక శ్రీఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని సపోట తోటలో మంగళవారం నాయీబ్రాహ్మణ క్షౌర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన సంఘ సభ్యులందరూ ఉత్సాహంగా వనసమారాధనలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల శాఖ నూతన అధ్యక్షుడిగా బత్తుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా తెన్నేటి విశాక్, గౌరవాధ్యక్షుడిగా పావులూరి రామ్మోహన్‌రావు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఆముదాలపల్లి రాజేష్, సంయుక్త కార్యదర్శిగా ఆకునూరు శ్రీనివాసరావు, కోశాధికారిగా గుండిమెడ శ్రీరామ్, మరో 25 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతం కోసం సభ్యులందరూ ఐక్యతగా ఉండాలని నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గన్నవరం వార్డు సభ్యుడు గుండిమెడ ఉదయభాస్కర్, సంఘ నాయకుడు పొదిలి జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.